ప్రజాశక్తి

ఆదివారం 17 ఆగస్టు 2025 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



ఒంగోలు, ఆర్టీసీ బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎక్కేందుకు క్యూ కట్టిన మహిళలు

మహిళలతో
బస్సులు కిటకిట

- తొలిరోజు ప్రయాణికుల పడిగాపులు..
- స్త్రీ శక్తి పథకం అమలుతో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రద్దీ



'జీరో' టిక్కెట్లతో మహిళలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

స్త్రీ శక్తి పథకం అమలుతో ఆర్టీసీ బస్సులు దాదాపు అన్నీ కిటకిటలాడుతున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఈ పథకం అమలు కావడం, ఎప్పటినుండో ఎదురు చూస్తున్న మహిళలు శనివారం నాడు బస్సుల్లో ప్రయాణించేందుకు ఉత్సాహం ▶ 2లో

'రెట్టింపు ఆదాయం' సాధ్యమేనా.?

- జిల్లా విజన్‌ప్లాన్‌లో లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు
- తలసరి ఆదాయం రూ.2.15 లక్షల నుంచి రూ.4.27 లక్షలకు పెరగడం సాధ్యమా?
- తొలి ఏడాదిలోనే వ్యవసాయం రంగంలో ధరల్లేక రైతుల తీవ్ర నష్టాలు
- పారిశ్రామిక రంగంలోనూ కనిపించని సానుకూలత



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో జిల్లా అధికారులు అభివృద్ధి, తలసరి ఆదాయాలపై లక్ష్యాలతో కూడిన నివేదికలను ఇటీవల రూపొందించారు. వాటిని ఇప్పటివరకూ ప్రజలకు వివరించలేదు. రాష్ట్రస్థాయి సమావేశాల్లో కలెక్టర్ నివేదించారు. ఈ విజన్ ప్లాన్ లక్ష్యాలు ఏమిటనేది ప్రజలకు సవివరంగా వెల్లడించలేదు. స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చేసిన ఉపన్యాసంలో కొన్ని అంశాలను స్థూలంగా చేర్చారు. ఈ నివేదికల్లో వెల్లడించిన గణాంకాల మేరకు అభివృద్ధి సాధ్యమేనా? అదీ రానున్న నాలుగేళ్లలో జరుగుతుందని లక్ష్యంగా పెట్టుకోవడం ఇప్పుడు చర్చగా మారింది.

2028-29 నాటికి 15 శాతం వృద్ధి రేటుతో తలసరి ఆదాయాలు రెట్టింపు చేస్తామని గణాంకాల్లో ఉంది. తలసరి ఆదాయం ప్రస్తుతం 2 లక్షలా 15 వేలా 240 రూపాయలు ఉండగా.. దాన్ని 4 లక్షలా 27 వేలా 409కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం ప్రణాళికలు తయారుచేశారు. జిల్లాలో అందుబాటులో ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకొని.. రాబోయే ఐదేళ్లలో ఈ వృద్ధి రేటు సాధించాలని నిర్ణయించారు. ఇందుకోసం జిల్లాస్థాయిలోనే కాకుండా నియోజకవర్గ స్థాయిలోనూ, తర్వాత మండల స్థాయిలోనూ విజన్ యాక్షన్‌ప్లాన్‌లను తయారుచేశారు. ప్రధానంగా వ్యవసాయం, పారిశ్రామికరంగం, సేవా రంగాలలో ఆశించిన పురోగతితోనే అభివృద్ధి, ఆదాయాల పెంపు సాధ్యమని భావిస్తున్నారు. వ్యవసాయరంగంలో ఉత్పత్తుల ద్వారా రూ.19,950 కోట్లు ఉండగా దాన్ని రూ.38,188 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అదేవిధంగా పారిశ్రామిక రంగాలలో ప్రగతి, తద్వారా ఆదాయాలు రూ.16,842 కోట్ల నుంచి రూ.35,870 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సేవారంగాలనుంచి రూ.18,311 కోట్ల నుంచి రూ.40,654 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. లక్ష్యాలు బాగానే ఉన్నాయి. వృద్ధిరేటును నిర్ధారించే రంగాల్లో ఏం జరుగుతోంది? నిజంగా మనం అనుకున్న లక్ష్యాలు సాధించే దిశగా ఆయా రంగాల్లో పరిస్థితులున్నాయా? అనేది ఆలోచించాలి. వ్యవసాయరంగాన్ని చూసుకుంటే ఈ రంగం ద్వారా వృద్ధిరేటుకు ▶ 2లో

కోదండ రామునికి
రూ.కోట్ల ఆస్తులున్నా..కష్టాలే.!

- అన్ని భూములూ అన్యాక్రాంతమే..
- నిద్రపోతున్న దేవాదాయ శాఖ
- పూర్తిగా దెబ్బతిన్న దేవస్థానం
- ధూపదీప నైవేద్యాలు సైతం కరువే..
- ఊళ్లపాలెంలో ఆలయ పరిస్థితి



ఊళ్లపాలెంలోని ఆలయం

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో ఉన్న కోదండరాముడికే కష్టాలు వచ్చి పడ్డాయి. కోట్ల రూపాయలు ఆస్తులున్నా.. ఆ కోదండ రాముడుకి ధూపదీప నైవేద్యాలూ కరువయ్యాయి. ప్రభుత్వాలు మారుతున్నా.. అక్కడ నాయకులు మారుతున్నా.. కోదండరామ స్వామి దేవస్థానం నిర్వహణ తీరు మాత్రం మార్చటం లేదు. ప్రతి సంవత్సరం మే నెలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు అక్కడ నుంచి వెళ్లి వ్యాపారాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డ వాళ్లంతా ఆ తిరునాళ్లకు వచ్చి ఈ దేవస్థానాన్ని బాగు చేస్తామని మాటలు చెప్పి.. వెళ్లటం తప్ప.. అది సాధ్యం కాలేదు. ఇక పట్టించుకోవలసిన దేవాదాయ శాఖ అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉండడంతో ఆ కోదండరాముడి ఆలయ నిర్వహణ పరిస్థితి దారుణంగా తయారైంది.

శింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెం గ్రామంలో ఉన్న ఈ దేవస్థానంలో ప్రస్తుతం ధూపదీప నైవేద్యాలూ కరువయ్యాయి. ఈ దేవస్థానానికి సంబంధించి కొత్తపట్నం మండలం అల్లూరు దగ్గర 17 ఎకరాలా 15 సెంట్ల భూమి ఉంది ఈ భూమిని ఒంగోలు ప్రాంతానికి చెందిన కొందరు కొత్తపట్నం ప్రాంతానికి చెందిన కొందరు ఆక్రమించడంతో అన్యాక్రాంతమైంది. దీనిపై గ్రామస్తులు ఎన్నిసార్లు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నాటి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పివి రెడ్డి దేవస్థానానికి సంబంధించిన భూములను స్వాధీనం చేసుకొని దేవస్థానాన్ని అభివద్ధి చేయాలని అందరి వద్దకూ తిరిగినా ఫలితం శూన్యమైంది. అప్పట్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ భూములు ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలోనూ ఆ భూములను స్వాధీనం చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలని అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్ణయం తీసుకున్నా సాధ్యం కాలేదు. నేడు కూటమి ప్రభుత్వంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి దృష్టికి ఈ విషయాన్ని నాయకులు తీసుకుపోయి కొత్తపట్నం వద్ద ఉన్న 17 ఎకరాల 15 సెంట్లు భూమిని స్వాధీనం చేసుకొని దేవస్థానం అభివద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ప్రధాన పట్టణమైన శ్రీనగర్లో కోట్ల రూపాయలు విలువచేసే కోదండ రాముడికి సంబంధించి ఒక భవనం ఉన్నట్లు గుర్తించారు. అప్పట్లో ఆ భవనాన్ని తమిళనాడు రాష్ట్రానికి చెందిన ▶ 2లో



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ స్వామి

రోడ్లను అద్భుతంగా తీర్చిదిద్దాం..

- జగన్ జీవితమంతా అవినీతిమయమే..
- కొండెపి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-శింగరాయకొండ

జగన్మోహన్‌రెడ్డి జీవితమంతా అవినీతి మయమే అని, అలాంటి అవినీతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి మాట్లాడుతున్నారని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయంలో పక్క రాష్ట్రాలు కూడా రోడ్లు గుంతలమయమని నవ్వుకుంటే.. అలాంటి రోడ్లను ఈరోజు అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. శనివారం రాత్రి కొండేపి మార్కెట్ కమిటీ చైర్మన్ గా కర్ణ తిరుపతమ్మ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం శింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడారు. జగన్ పాలనంతా పరదాలతో ముందుకు వెళ్లాడని, నేడు కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలు అమలు చేసి.. ప్రజల్లో తిరుగుతున్నామన్నారు. జిల్లాలో రహదారులు పరిస్థితి తనకు తెలుసని, అన్ని రోడ్లకూ నిధులిచ్చే బాధ్యత తనదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీని నమ్ముకుంటే ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్న ఉదాహరణ కర్ణ తిరుపతమ్మ, కర్ణ కోటిరెడ్డి అని తెలిపారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఈరోజు నియోజకవర్గ స్థాయిలో చైర్మన్‌గా ఎంపిక అవటం జరిగిందన్నారు. ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ సచివాలయ వాలంటీర్ల వయోవద్ధుల శాఖ మంత్రి డాక్టర్ డోలా ▶ 2లో

మహిళలతో బస్సులు కిటకిట..

'రెట్టింపు ఆదాయం' సాధ్యమేనా.?

(మొదటిపేజీ తరువాయి)

37.02 శాతంగా ఉంది. ఈ రంగం నుంచి పంటలు, ఉద్యానవన పంటలు, పాడిపరిశ్రమ, మత్యశాఖ ఉత్పత్తులతో ప్రధానంగా ఆదాయాలు రెట్టింపు చేయాలని నిర్ణయించారు. లక్ష్యం బాగానే ఉంది. వ్యవసాయరంగంలో ఇప్పుడున్న పరిస్థితి చూస్తే సంక్షోభం కొనసాగుతోంది. సాగు విస్తీర్ణానికి సరిపడా నీళ్లు లేవు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాలేదు. నీళ్లు ఉంటేనే పంట. లేకుంటే సాగు ఎండమావే.. ఇక పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక వాణిజ్యపంటలు సాగుచేసిన రైతులు నష్టాల పాలయ్యారు. వారికి గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొన్న ప్రభుత్వం వచ్చే ఏడాది ఈ పంటనే నిషేధించారు. ప్రత్యామ్నాయం లేదు. శనగ, మిర్చికి ధరల్లేవు. కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటున్నారు. వ్యవసాయం ఒడిదుడుకులను ఎదుర్కొంటుంటే అందుకు కారణాలు గుర్తించి సరిదిద్దలేదు. రైతులు అన్ని విధాలా నష్టాల్లో ఉంటే ఈ రంగంలో 15 శాతం వృద్ధిరేటు సాధ్యమా? అనేదీ ఆలోచించాలి. లక్ష్యాలను అధిగమించేందుకు చర్యలూ ఉండాలి. పంటల ఉత్పత్తులను పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవడం మంచిదే. అందుకు తగ్గ చర్యలూ ఉండాలి. ఇప్పుడు చర్యలు లేవు.పారిశ్రామిక రంగంలోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికీ జిల్లాలో పరిశ్రమలు లేవు. ఉపాధి లేదు. లక్షలాది మంది ఇతరప్రాంతాలకు వలసపోతున్నారు. చదువుకున్న యువతకూ ఇక్కడ ఉద్యోగాలు లేవు. ప్రతిపాదిత పారిశ్రామిక వాడలు అలాగే ఉన్నాయి. కనిగిరి, దొనకొండ పరిశ్రమల కేంద్రాలు ఎండమావులుగా ఉన్నాయి. ఏళ్ల తరబడి వాటిపై మాటలు తప్ప చర్యలు లేవు. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టినా ఇక్కడ పరిశ్రమలు రాలేదు. ఇటీవల కొన్ని ప్రకటించారు. అవి కూడా ఆచరణలోకి రావాల్సి ఉంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంపు ఆంక్షలతో రొయ్యల ఎగుమతులపై సంక్షోభం తలెత్తింది. ధరలు హెచ్చుతగ్గులకు గురయ్యాయి. ఇంకా అనేక రకాల ఎగుమతులపైనా ప్రభావం ఉంటుంది. ఇక మూడోది సేవారంగం నుంచి వృద్ధిరేటుకు గణాంకాలను రూపొందించారు. పై రెండు రంగాల్లో ఆశించిన పురోగతి ఉంటే సేవారంగం నుంచి పన్నుల రూపంలో ఆదాయాలు వస్తాయి. ఆ రెండు రంగాల్లో సంక్షోభం నిస్తేజం ఉంటే పన్నులు తగ్గుతాయి. ఆదాయాల కోసం ప్రజలపై పన్నుల భారం మోపక తప్పదు. ప్రస్తుతం ఇళ్లపన్నుల నుంచీ వివిధ రూపాల్లో కరెంటు బిల్లులలో ట్రూఅప్‌ఛార్జీలు వంటివి కలిపి వేస్తున్నారు. ఇవన్నీ ప్రజలకు భారాలుగా మారాయి. మరో వైపు పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం ఆదాయాలపై ప్రభావం చూపుతున్నాయి. కుటుంబాల ఆర్థిక పరిస్థితులపై స్పష్టంగా ఉంటుంది. సహజవనరుల ఆధారంగా అభివృద్ధి సాధించాల్సిన లక్ష్యాలకు అనుగుణంగా చర్యలూ ఉండాలి. ప్రభుత్వం ఏ రంగంలో ఏ తరహా చర్యలు చేపట్టాలో అలా చేపడితేనే అనుకున్నది సాధ్యమవుతుంది.

కోదండ రాముడికి.. రూ.కోట్ల ఆస్తులున్నా..కష్టాలే.!

(మొదటిపేజీ తరువాయి)

ఓ భక్తుడు ఈ దేవుడికి ఇవ్వటంతో దానిని కనిపెట్టేందుకు దేవాదాయ శాఖ అధికారులు నేటికీ ప్రయత్నం చేయడం లేదు. గ్రామస్తులు మాత్రం ఆ కోట్ల రూపాయలు విలువ చేసే ఆ భవనాన్ని, కొత్తపట్నం వద్ద ఉన్న ఈ భూములను స్వాధీనం చేసుకుంటే కోదండ రామస్వామి దేవస్థానానికి కోట్ల రూపాయలు ఆస్తులు ఉంటాయని చెబుతున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పూర్తిగా నిద్రావస్థలో ఉండటం వల్ల.. ఇలాంటి భూముల విషయాలు, భవనాల విషయాలను బయటకు తీయడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దేవాదాయశాఖ అధి కారులు మే నెలలో జరిగే బ్రహ్మోత్సవాలకి రెండు రోజులు తప్ప ఆ తర్వాత దేవస్థానం వైపు కన్నెత్తి కూడా చూడరని స్థానికులంటున్నారు. దేవస్థానం కూడా పూర్తిగా దెబ్బతిని పోవడంతో ఆ దేవస్థానం వద్దకి ఎవరూ వెళ్లటం లేదు. ఇక రథం పరిస్థితి అయితే ప్రతి సంవత్సరం అక్కడ ఉత్సవ విగ్రహాలు పెట్టి రథం తిప్పినట్లు చేస్తున్నారు తప్ప ఆ రథం పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదు.

కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శివాలయం, సాయిబాబా దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లారుజామున తలంటి స్నానాలు చేసి దేవాలయాలకు వెళ్లారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో అందంగా అలంకరించారు. దేవాలయ కమిటీలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉట్టి కొట్టే కార్యక్రమాలను తిలకించారు.

మహిళలతో బస్సులు కిటకిట..

(మొదటిపేజీ తరువాయి)

చూపిన ఘట్టాలు కనిపిస్తున్నాయి. నిన్నటివరకు 60 నుంచి 70 శాతం ప్రయాణికులు నడిచే బస్సులు శనివారం కిటకిటలాడాయి. కొన్ని ప్రాంతాలకు సకాలంలో బస్సులు రాకపోవడం వల్ల గంటల కొద్దీ ప్రయాణికులు పడిగాపులు కాశారు. ఒక్క సర్వీస్ కూడా రద్దు చేయలేదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు.

బైపాస్ రైడర్లు - ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కిటకిట..

శనివారం నాడు ఎక్కువ ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు ఎక్కువగా తిరిగే చీరాల, మార్కాపురం, అద్దంకి, పొదిలి, గుంటూరు వెళ్లే బస్సులు కిటకిటలాడాయి. ప్రతి గంటకు ఒక సర్వీస్ నడిపే గిద్దలూరు ఎక్స్‌ప్రెస్ 75 శాతం మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది. గుడివాడ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీస్ దాదాపు మహిళా ప్రయాణికులతో నిండిపోవడం గమనార్హం. బైపాస్ రైడర్ సర్వీసుల్లో కూడా అనుమతి ఇవ్వడంతో ప్రతి అరగంటకు ఒంగోలు-చీరాల మధ్య నడిపే బైపాస్ రైడర్ సర్వీసులు మహిళా ప్రయాణికులతో కిటకిటలాడాయి. చీరాల పల్లె వెలుగులో ప్రయాణం చేసే ప్రయాణికులు బైపాస్ రైడర్ పట్ల ఆసక్తి చూపినట్లు కనిపించింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పరిమితంగా, పల్లె వెలుగు సర్వీసులు ఎక్కువ తిరిగే రూట్లు కావలి, కందుకూరు, పామూరు, ఇంకొల్లు, నరసరావుపేట, వినుకొండ, కొండపి వంటి రూట్లలో రోజూ కంటే ప్రయాణికుల రద్దీ పెరిగినట్లు విశ్లేషణలున్నాయి. ఆయా రూట్లలో రోజూ 40 నుంచి 50 శాతం మహిళా ప్రయాణికులు ఉండగా ఒక్క రోజులో 75 శాతం పెరిగినట్లు ఆయా రూట్లో కండక్టర్లు తెలిపారు.

గుర్తింపు కార్డు ఏ రూపంలో ఉన్నా అనుమతి..

ఆర్‌ఎం సత్యనారాయణ

పొదిలి: స్త్రీ శక్తి పథకానికి నిర్దేశించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్ లేదా జిరాక్స్, మొబైల్ ఫోన్‌లో ఉన్నా అనుమతించాలని సిబ్బందికి ఆర్‌ఎం జి.సత్యనారాయణ సూచించారు. శనివారం ఆయన పొదిలి డిపోను సందర్శించారు. ప్రయాణికులతో మాట్లాడారు. వివిధ మార్గాల తిరుగుతున్న బస్సుల ఓఆర్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీశైలం, నంద్యాల ఘాట్ రోడ్డులో బస్సు సీటింగ్ మేరకు ఉచిత ప్రయాణానికి మహిళలకు అనుమతులు వచ్చాయని తెలిపారు. పొదిలి డిపో పరిధిలో దర్శి దొనకొండ మార్గంలో ప్రస్తుతం తిరుగుతున్న బస్సుల సంఖ్య ట్రిప్పులను పెంచామన్నారు. పొదిలి-దర్శి-అద్దంకి- గుంటూరు కొత్త సర్వీసులు మంచి రాబడిలో ఉన్నాయని, అదనంగా ఈ మార్గంతో పాటు ఒంగోలు మీదుగా పొదిలి విజయవాడ నూతన లగ్జరీ సర్వీసులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గిద్దలూరు మార్గంలో పొదిలి, కంభం ఆర్డినరీ సర్వీసులు ప్రవేశపెట్టేందుకు పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ మార్గంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు తిరుగుతున్నందున ప్రత్యేకంగా కొన్ని నిర్దిష్టమైన పాయింట్లలో గ్రామాల వద్ద బస్సులు ఆపేందుకు ఆ డిపో పరిధిలో డ్రైవర్లకు నోటీస్ బోర్డ్ వేయాలని సంబంధిత డిపో మేనేజర్ కు సూచించామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శంకర్రావు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను అద్భుతంగా తీర్చిదిద్దాం..

(మొదటిపేజీ తరువాయి)

శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి హద్దురాళ్ల మీద, పాసు పుస్తకాల మీద బొమ్మలు వేసుకొని ప్రజలను మోసం చేశారన్నారు. అలాంటివన్నీ తొలగించి రైతులకు న్యాయం జరిగే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. దామచర్ల ఆంజనేయులు మంత్రిగా ఉన్నప్పుడు ఆగిపోయిన అభివృద్ధి పనులు తాను చేశానని, తాను గతంలో శాసనసభ్యులుగా ఉన్న సమయంలో ఆగిపోయిన అభివద్ధి పనులు మళ్లీ మంత్రిగా చేస్తున్నానని పేర్కొన్నారు. నాగార్జున సాగర్ నుంచి నీరు కొండేపి నియోజకవర్గానికి తీసుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి, బిఎన్ విజయ్‌కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మద్దులూరి మాల కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, లంక దినకర్, గూడూరు ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ముందుగా పాకల రోడ్డు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ, కర్ణ కోటిరెడ్డి ఆధ్వర్యంలో సభకు హాజరైన వారిని ఘనంగా సత్కరించారు

ప్రజాశక్తి
ఆదివారం 17 ఆగస్టు 2025

కార్మికవర్గంపై దాడిని ఐక్యంగా తిప్పికొట్టాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి-వెలిగండ్ల

కార్మికవర్గంపై జరుగుతున్న దాడిని ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముప్పా రమేష్ అన్నారు. శనివారం స్థానిక వెలిగండ్ల ప్రజా సంఘాల కార్యాల యంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. వెలిగండ్ల మండల సిఐటియు మూడో మహాసభ కుమ్మరికుంట ఏస్తేరమ్మ అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు అంగన్వాడి హెల్పర్ సీనియర్ నాయకురాలు సోమనబోయిన బాలగురవమ్మ జెండా ఆవిష్కరణ చేసి సభను ప్రారంభించారు. అనంతరం మహాసభలో జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ కార్మికవర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలన్నీ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్నవే అన్నారు. ఇది సమరశీల కార్మిక వర్గ చరిత్ర అని కొనియాడారు. ప్రైవేటీకరణ వలన కాంట్రాక్ట్, అతి తక్కువ జీతాలతో పనిచేయడం, పని భద్రత లేకపోవడం లాంటి అనేక సమస్యలతో కార్మిక వర్గం నేటికీ సతమవుతుందన్నారు. ఇప్పుడున్న కార్మిక హక్కులకు రక్షణ కూడా లేకుండా కార్మిక వర్గాన్ని అణచడానికి, శ్రమ దోపిడీని తీవ్రం చేయటానికి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. పాలకవర్గంలోని బిజెపి బడా కార్పొరేట్లు అంబానీ, ఆదానీలకు దాసోహం ఉంటుందని వారికి అనుకూలంగానే లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్స్ వలన కార్మికులకి ఈఎస్ఐ, పిఎఫ్, పని భద్రత, పనిగంటలు, కనీస వేతన చట్టం అమలు కావటం లేవన్నారు. ఇవన్నీ కార్మికులకు వర్తించాలంటే దీని అడ్డుకోవడానికి కార్మిక వర్గాన్ని నిరవధిక పోరాటానికి సిద్ధం చేయాలని లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జరిగే సమరశీల ఐక్య పోరాటాల్లో ముందుండాలని వారు పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలకు అత్యవసర పరిస్థితుల్లో సెలవులు మంజూరు కూడా ఇవ్వటం లేదని, వెలుగు యానిమేటర్స్‌కు నాలుగు నెలల నుంచి వేతనాలు రాలేదని, పంచాయతీరాజ్ గ్రీన్ కార్మికులకి 13 నెలల నుంచి జీతాలు కూడా పెట్టడం లేదని, అంగనవాడిలకు పనిభారం పెరిగిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపు ఉపసంహరించుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. జరిగిన మూడు సంవత్సరాల కాలంలో మండల సిఐటియు చేసిన అంశాలను చర్చించుకుని రాబోయే మూడు సంవత్సరాల కాలంలో చేయవలసిన కర్తవ్యాలను తీసుకొని కార్మికులని ఐక్యం చేసి సాధించుకోవాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, ఈఓఏలు, మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాల ఆయాలు, పంచాయతీరాజ్ గ్రీన్ కార్మికులు, బిల్డింగ్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్



జెండాను ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ట్రాక్టరు, ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం చదలవాడలో జరిగింది. వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన పాతూరి మార్తబాబు ఒంగోలు నుంచి ద్విచక్రవాహనంపై నాగులుప్పలపాడు వస్తుండగా ముందువెళ్తున్న ఇసుక ట్రాక్టరు చదలవాడ పెట్రోల్ బంకు వద్ద ఒక్కసారిగా ప్రక్కకు తిరగడంతో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. మార్తబాబు క్రిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

టంగుటూరులో చోరీ

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు గ్రామంలోని విష్ణాలయం బజారులో కనపర్తి శేషమ్మ ఇంట్లో చోరీ జరిగింది. శుక్రవారం రాత్రి శేషమ్మ సమీపంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లి నిద్రపోయింది. తెల్లారి ఇంటికి వచ్చి చూడగా తాళం పగుల కొట్టి తలుపు తీసి ఉంది. మంచంపై దుస్తులు చిందర వందరగా వేసి ఉన్నాయి. పర్సులోని రెండు బంగారుపు తాళిబొట్లు, రెండు లక్ష్మీ రూపులు, బంగారం గొట్టాం ఒకటి చోరీకి గురయ్యాయి. అంతేకాకుండా పర్సులోని రూ.12,500 నగదు కూడా దొంగిలించారు.



రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న సిఐ శ్రీకాంత్ బాబు

శ్రీనగర్ కాలనీలో పోలీసుల 'స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ఒంగోలులోని శ్రీనగర్ కాలనీలో ఒంగోలు రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధుల నిర్మూలనకు డ్రైనేజి కాలువలలో పూడికలు తీయించి, రోడ్డు మీద ఉన్నటువంటి పేడ, చెత్తను తొలగించి, బ్లీచింగ్‌తో శానిటేషన్ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు సిఐ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న మంత్రి స్వామి

ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండ

మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

ఆపదలో ఉన్న బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. టంగుటూరు మండలంలోని తన క్యాంపు కార్యాల యంలో యం.నిడమలూరుకి చెందిన ఆళ్ళ అనుపమ భర్త బెజవాడ సురేష్‌కు రూ.30 వేలు సీఎం సహాయ నిధి చెక్కును మంత్రి స్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పిడుగురాళ్ల సురేష్ బాబు పాల్గొన్నారు.

మంత్రి స్వామి శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంభందిత అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిం చారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభు త్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారా నికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి స్వామి తెలిపారు.

కోలాహలంగా ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో టీడీపీ నియోజకవవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నల విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీ కోలాహలంగా సాగింది. ఎక్కడ చూసినా పసుపు జెండాలు రెపరెపలాడుతూ రైతన్నల రథాలు ముండ్లమూరు మండలం పులిపాడు నుంచి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వరకు కిటకిటలాడాయి. పచ్చని వాతావరణంలో పల్లెల నుంచి రైతులు కదంతొక్కారు. గొట్టిపాటి లక్ష్మి జండా ఊపి రైతుల విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. అంతేకాక డాక్టర్ లక్ష్మి లలిత సాగర్‌లు ట్రాక్టర్ నడుపుతూ రైతన్నలను మరింత ఉత్సాహపరిచారు. దర్శి గడియార స్తంభం కూడలిలో డాక్టర్ లక్ష్మి ఎడ్ల బండి ఎక్కి కాడెద్దుల బండిని నడపటం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి రైతులు స్వచ్ఛందంగా వందలాది ట్రాక్టర్లతో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. రైతుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చంనాయుడు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వీరాయపాలెంలో ప్రారంభించారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, నూతనంగా నియమించబడిన సొసైటీ చైర్మన్లు, ఐదు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న గొట్టిపాటి లక్ష్మి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-సిఎస్‌పురం: మండలంలోని వెంకటాయచెరువు గ్రామానికి చెందిన లక్కిపోగు మరియమ్మ మృతి చెందగా సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.77 వేల చెక్కును తల్లి లక్కీపోగు అచ్చమ్మకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కోనంగి వెంకటకొండయ్య, బోయమడుగుల పంచాయతీ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్లిబోయిన రామకృష్ణ, మైలారి శేఖర్ పాల్గొన్నారు.



వృద్ధులకు కళ్ళజోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

వైద్యశిబిరాలు నిరంతరం కొనసాగిస్తా

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో కనిగిరి అమరావతి గ్రౌండ్‌లో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు వైద్యులు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి వైద్య శిబిరం సందర్శించి వృద్ధులను పరామర్శించి కంటి అద్దాలు అందజేశారు. పేదల ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వృద్ధులకు బిపి, షుగర్, కంటి పరీక్షలు చేయడం జరిగింది. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు శ్రద్ధ, శివాని లు కంటి వైద్య పరీక్షలు చేశారు. 305 మంది వైద్య శిబిరంలో పాల్గొనగా 130 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరందరిని ఈనెల 20వ తేదీన ఉగ్రనరసింహారెడ్డి ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నారు.

రెండు రోజులుగా నిస్సహాయ స్థితిలో..

బస్టాండులో కదలలేని స్థితిలో మహిళ

వైద్యశాలలో చేర్పించిన సేవాసంస్థ ప్రతినిధి

ప్రజాశక్తిం-శింగరాయకొండ

గత రెండు రోజులుగా శింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో బెంచ్ మీద నిస్సహాయ స్థితిలో ఓ మహిళ కూర్చొని ఉంది. వైద్యశాలకు వెళ్లడానికి వచ్చిందేమో అని తోటి ప్రయాణికులు, సిబ్బంది భావించారు. కానీ రెండు రోజులైనా ఆమె అక్కడే ఉండటంతో ఆరోగ్యం బాగాలేక, భారమని కుటుంబ సభ్యులు అక్కడ వదిలేసి వెళ్లారని భావించారు. తోటి ప్రయాణికులు ఏమి అడిగినా చెప్పలేని పరిస్థితిలో ఉంది. పెరాలసిస్ వచ్చి చెయ్యి, కాలు పనిచేయక మాట్లాడే పరిస్థితిలో లేదు. స్పందించిన స్వంతన సేవా సంస్థ ప్రతినిధి రావినూతల జయకుమార్ ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అయితే ఆమె నోటిలో నుంచి మాటలు రాకపోవటంతో ఆరోగ్య పరిస్థితి బాగాలేదని గ్రహించి 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆమె వివరాలపై ఆరా తీస్తున్నారు.





మహిళను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల

గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో వరి పైరు నీట మునిగి నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన సిపిఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎం జిల్లా నాయకులు టి కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారులు నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అధిక విస్తీర్ణంలో వరి వెద పద్ధతిలో సాగు చేశారని అన్నారు. ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలు మరమ్మత్తులు చేయకపోవడంతో పొలాల్లో చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక వరి పైరుకు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే కాలువల్లో పేరుకుపోయిన తూటి కాడ, గుర్రపు డెక్క తొలగించాలని కోరారు. జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో నల్లబర్లీ పొగాకు కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారుల తీరుతో పేద రైతులు నష్టపోతున్నారని అన్నారు. పేద రైతుల నుండి కూడా పొగాకు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన పొగాకు తాలూకు రైతులకు రావలసిన నగదును వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లాలో అధిక వర్షాలకు పనులు లేక ఇబ్బంది పడుతున్న పేదలకు ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో అనేక చోట్ల మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులతో పేదలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం దృష్టి పెట్టి మైక్రో ఫైనాన్స్ సంస్థలపై నిఘా ఉంచి పేదల ఇబ్బందులు తీర్చాలని కోరారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు నిర్వాహకులతో ఉన్నత స్థాయి సమావేశం కలెక్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు సిహెచ్ మజుందర్, ఎం వసంతరావు, ఎన్ బాబురావు, సిహెచ్ మణిలాల్ పాల్గొన్నారు.

'ప్రతిభ'పైనే ప్రైవేటు పాఠశాలల మనుగడ..

అపుస్మ రాష్ట్ర 52వ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య



థాంక్యూ సిఎం ప్లకార్డులతో ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ప్రైవేటు పాఠశాలల మనుగడ ప్రతిభ సాధనపై ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. స్థానిక పద్మశాలియ బహూత్తమ సంఘ కళ్యాణ మండపంలో శనివారం జరిగిన అపుస్మ రాష్ట్ర 52వ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని అన్నారు. రెండు ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహిస్తున్న తనకు ఆ సమస్యలపై అవగాహన ఉందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఎంత ముఖ్యమో, ప్రైవేటు పాఠశాలలు కూడా అంతే ముఖ్యమని గుర్తు చేశారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యం ఆంధ్రప్రదేశ్‌ను మోడల్ ఎడ్యుకేషన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమేనని తెలిపారు. ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు సమిష్టి కృషి ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలలకు మూడేళ్ల అనుమతులు ఎనిమిదేళ్లకు పెంచడం, తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలోని పిల్లలందరికీ వర్తింపజేయడం, ప్రతిభ అవార్డులు ప్రైవేటు పాఠశాలలకు విస్తరించడం, అనుమతి లేకుండా ఇతరులు పాఠశాలల్లోకి ప్రవేశించకుండా చట్టం చేయడం వంటి నిర్ణయాలకు కృతజ్ఞతగా థాంక్యూ సీఎం, థాంక్యూ లోకేష్ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్, ఎంఎల్సి ఎంవి రామచంద్రారెడ్డి, ఎఎంసి చైర్మన్ జనార్దన్, మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, అపుస్మ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు వి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన సలహాదారు జి పుల్లయ్య, రాష్ట్ర సహాధ్యక్షుడు జెఎస్‌పి బాలాజీ, రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, శ్రీ గౌతమి విద్యా సంస్థల అధినేత ఎం వెంకటేశ్వర్లు (ఎంవి) తోపాటు రాష్ట్ర, జోన్, ప్రాంతీయ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువాలు బహూకరణ


పాఠశాలకు దాతలు బహూకరించిన బీరువాలు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్ఎంసి చైర్మన్ గొట్టిపాటి హరికృష్ణ జాతీయ పతాకావిష్కరణ గావించారు. సభలో వక్తలు స్వాతంత్రోద్యమ నాయకుల త్యాగాలు కొనియాడారు. అనంతరం 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మద్దినేని నరేంద్ర తన సోదరుడు మద్దినేని అమరేంద్ర జ్ఞాపకార్థం బంగారు, వెండి పతకాలు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఉన్నతంగా ఎదగాలని, చదువుల్లో రాణించాలని ఆశీస్సులందించారు. చందలూరు 1990-95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల తరపున చిలుకూరి లక్ష్మీకాంతయ్య హాజరై తన మిత్రులతో కలిసి జూన్ 1న జరిగిన సమ్మేళనం గుర్తుగా పాఠశాలకు రూ.2 లక్షల విలువైన 10 ఇనుప బీరువాలు (60 లాకర్స్), ర్యాబినెట్లు, 60 తాళాలను పాఠశాలకు అందజేశారు. 1990-95 బ్యాచ్ పూర్వ విద్యార్థినీ, విద్యార్థుల దాతృత్వాన్ని సభలోని వక్తలు కొనియాడారు. పాఠశాల్లో చదువుకున్న విద్యార్థులు తమవంతుగా విరాళాలు ఇచ్చిన ఔదార్యానికి నిదర్శనమని కొనియాడారు. చిలుకూరి లక్ష్మీ కాంతయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు తమ సందేశాన్ని అందించారు. గతేడాది మాదిరిగానే విద్యా దాతలు విద్యార్థులకు నగదు బహుమతులు అందించడానికి పోటీపడ్డారు. ఈ సంవత్సరం నూతనంగా తీగల లక్ష్మీ తన భర్త జ్ఞాపకార్థం మండలంలో ప్రథమ స్థానం, పాఠశాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 10వ తరగతి విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేలు అందించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రిపేర్ సంస్థ కోఆర్డినేటర్ రమణారెడ్డి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లిలోని ప్రిపేర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయం నందు రైతులకు ప్రకృతి వ్యవసాయం, కాషాయలు, మల్టీ గ్రీన్స్, పురాతన వ్యవసాయ పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలల నుంచి 35 మంది రైతులకు అవగాహన వాలంటీర్లుగా నియమించారు. ప్రిపేర్ స్వచ్ఛంద సేవా సంస్థ సీనియర్ ఎంప్లాయిస్ ఎన్‌వి.రమణారెడ్డి, ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిపేర్ కమ్యూనిటీ హెల్త్ నర్సులు, కో ఆర్డినేటర్లు ఎం రవిచంద్ర, జి ఆశ, స్టాఫ్ హెప్సిబా, మెర్సీ, మంజుల, రాజకుమారి, స్వాతి, మయూరి, శ్రీలేఖ, భవాని, ప్రసన్న, దేవమని పాల్గొన్నారు.

వైసిపి అధ్యక్ష పదవి ఎస్సీలకు ఇవ్వాలి

ప్రజాశక్తి - పర్చూరు

వైసిపి మండల అధ్యక్ష పదవిని ఎస్సీలకు కేటాయించాలని ఆ పార్టీకి చెందిన దళిత నాయకులు మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జునకు వినతి పత్రం శనివారం అందజేశారు. మద్దిపాడులోని వైసిపి కార్యాలయంలో ఆయనను కలిశారు. గతంలో ఇంకొల్లు మండల అధ్యక్ష పదవి దళితులకు కేటాయించగా ఈసారి దళితులకు మండల అధ్యక్ష పదవి నియోజకవర్గంలో ఎక్కడా ఇవ్వలేదని తెలిపారు. పార్టీలో తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కూరాకుల ఇసాక్, కట్టా రత్నం, గేరా స్వరాజ్, బండి రాంబాబు, జంగా వంశీ, బిళ్ళా అశోక్, రేగులగడ్డ అరుణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు జె నిఖిల్, వై లోకేష్ డిమాండ్ చేశారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శనివారం సెలవైనప్పటికీ కొన్ని విద్యాసంస్థలు తరగతులు నిర్వహించారని తెలిపారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో చైతన్య, నారాయణ, ఎన్ఆర్ఐ విద్యా సంస్థలు విద్యార్థులతో తరగతులు నిర్వహించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే కలెక్టర్, విద్యా శాఖ అధికారులు స్పందించి ఆయా విద్యాసంస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, చైతన్య, సంజయ్, సురేష్, సందీప్ పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఆనందబాబు

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపులివర్రుకు చెందిన టిడిపి కార్యకర్త జిలుగు రాజశేఖర్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసన సభ్యులు నక్క ఆనందబాబు శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. సానుభూతిని వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు జంపని నాంచారయ్య కుమారుడు జంపని వెంకటేష్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


క్విజ్ పోటీల బహుమతులు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పర్చూరు


స్థానిక బివిఆర్ రోటరీ భవన్లో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పర్చూరు, కారంచేడు, పంగులూరు, ఇంకొల్లు మండలాల స్థాయిలో క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో 10 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానం పర్చూరు శారదా హైస్కూల్ విద్యార్థులకు రూ.2516, షీల్డ్, విలువైన పుస్తకాలు, 2వ స్థానం ఇంకొల్లు ఆదర్శ హై స్కూల్ విద్యార్థులకు రు.2116, షీల్డ్, విలువైన పుస్తకాలు, 3వ స్థానం ఇంకొల్లు సాయిరాం హైస్కూల్ విద్యార్థులకు రు.1516, షీల్డ్, విలువైన పుస్తకాలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, ఆయా పాఠశాలలకు మెమొంటోలు అందజేశారు. పోటీలు ఉదయభాస్కర్, తేళ్ల రమేష్ చంద్ర న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, రావి సత్యనారాయణ పాల్గొన్నారు.

'మోర్'లో మోసం.?


అదనపు బిల్లులతో వినియోగదారుల జేబుకు చిల్లు..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కార్పొరేట్ స్టోర్లల్లో ధరలు తక్కువగా ఉంటాయనే ప్రచారంతో ప్రజలు ఎక్కువగా అలాంటి స్టోర్లకే వెళుతున్నారు. అయితే వినియోగదారుల నమ్మకాన్నే ఆసరాగా చేసుకొని కొన్ని కంపెనీలు అధిక ధరలతో పాటు అదనపు బిల్లులతో కూడా వారి జేబులకు చిల్లులు పెడుతున్నాయి. బాధితుల్లో బాగా చదువుకున్నవారు కూడా ఉండటం గమనార్హం. శనివారం నాడు ఓ డాక్టర్ నగరంలోని భాగ్యనగర్ వద్ద ఉన్న మోర్ రిటైల్ స్టోర్‌కు వెళ్లారు. అక్కడ పలు వస్తువులు కొనుగోలు చేశాడు. అక్కడ ఉన్న క్యాషియర్ వద్ద కంప్యూటర్‌లో బిల్లు రూ.761 వచ్చింది. ఆ డాక్టర్ ఏదో బిజీలో ఉండి.. రూ.761ను యుపిఐ పేమెంట్ ద్వారా ఫోన్‌లో చెల్లించారు. తర్వాత



మోర్ స్టోర్‌కు ఆన్‌లైన్ ద్వారా డాక్టర్ చేసిన కంప్లైంట్



డాక్టర్ చేసిన యుపిఐ పేమెంట్

తాను కొనుగోలు చేసిన వస్తువుల ధరలు పరిశీలించగా.. రూ.577 మాత్రమే అయ్యింది. తన వద్ద అధికంగా బిల్లు వసూలు చేశారని గ్రహించిన సదరు డాక్టర్ మోర్ సిబ్బందిని సంప్రదించగా.. వారి నుంచి సరైన స్పందన రాలేదు. దీంతో ఆయన మోర్ రిటైల్‌కు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాగా చదువుకున్న వారి పరిస్థితే ఇలా ఉంటే.. సాధారణ ప్రజానీకం మోసపోవడం పెద్ద విషయం కాదేమో.?

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జెవివి సీనియర్ నాయకుడు ఏ.వి. పుల్లారావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సెప్టెంబర్ 13, 14 తేదీలలో విజయనగరంలో జరగనున్న జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర 18వ మహాసభలను విజయవంతం చేయాలని జెవివి సీనియర్ నాయకుడు ఏ.వి. పుల్లారావు పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం శనివారం ఒంగోలులోని జెవివి జిల్లా కార్యాలయం ఎల్.బి.జి భవన్లో జిల్లా అధ్యక్షులు యు. వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పుల్లారావు మాట్లాడుతూ 38 సంవత్సరాల క్రితం స్థాపించబడిన జెవివి రెండు తెలుగు రాష్ట్రాల్లో శాస్త్రీయ సమాజ నిర్మాణ లక్ష్యంతో కషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, యువకులు సభ్యులుగా చేరి ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు సి.హెచ్. జయప్రకాష్, యు.భాస్కర్ మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం వంటి



జెవివి రాష్ట్ర మహాసభలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అంశాల సాధన కోసం వేదిక కషి చేస్తోందని వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51(ఏ-హెచ్) ప్రకారం శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించడానికి ప్రభుత్వాలు మరింత చిత్తశుద్ధితో కషి చేయాలని సూచించారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించేందుకు, సైన్స్ పట్ల ఆసక్తి కలిగించేందుకు, సజనాత్మకతను వెలికితీసేందుకు జెవివి గత 36 ఏళ్లుగా చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈ ఏడాది జరగబోయే చెకుముకి సైన్స్ సంబరాలకు ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలు కషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తొలుత రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి. దేవప్రసాద్, ఏ. విశ్వరూపం, ఎస్.వి. రంగారెడ్డి, ఎస్.టి. వెంకటేశ్, జె. శేఖర్ పాల్గొన్నారు.

అందుబాటులో హిస్టీరోస్కోపీ పరీక్షలు

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో తొలిసారిగా హిస్టీరోస్కోపీ అందుబాటులోకి వచ్చాయని, గైనిక్ విభాగ వైద్యులు ఈ ఘనత సాధించినట్టు జి జి హెచ్ సూపరెంటెండెంట్ డా మాణిక్యరావు, గైనిక్ విభాగాధిపతి డా సంధ్యా రాణి తెలిపారు. పెద్ద నగరాలు, లేదా అత్యాధునిక పరికరాలు అందుబాటులో వుండే ప్రదేశాల్లో మాత్రమే ఈ హిస్టీరోస్కోపీ పరీక్షలు జరుగుతున్నాయన్నారు.జి జి హెచ్ లో వచ్చిన ఈ పరికరం మహిళలకు వరం లాంటిది అని వీరు తెలిపారు. హిస్టీరోస్కోపీ అనేది ఒక ప్రత్యేకమైన పరీక్ష / చికిత్స పద్ధతి అని, హిస్టీరోస్కోప్‌గా పిలిచే చిన్న కెమెరా లాంటి పరికరాన్ని గర్భాశయంలోకి ప్రవేశపెట్టి లోపల నుంచి స్పష్టంగా చూసే అవకాశం ఉంటుందన్నారు. నెలసరి ఎక్కువగా రావడం, ఎక్కువ



సూపరింటెండెంట్ మాణిక్యరావు

రోజులు కొనసాగడం లేదా మధ్యలో రక్తస్రావం వంటి సమస్యలను గుర్తించడానికి, గర్భధారణ రాకపోవడానికి, వరుసగా గర్భస్రావం కావడానికి ఉన్న కారణాలను తెలుసుకోవడంలో సహాయపడుతుందన్నారు. గర్భాశయంలో ఉండే చిన్న మాంసపు గడ్డలు, ముడులు లేదా అవరోధాలను గుర్తించి తొలగించడానికి. జన్యుపరమైన లోపాలు ఉన్నప్పుడు వాటిని సరిచేయడానికి ఉపయోగపడుతుందన్నారు. సమస్య ఏదైనా కనిపిస్తే, వెంటనే చిన్న పరి కరాల సహాయంతో తొలగించవచ్చని వారు తెలిపారు. ఈ పరీక్షలకు కత్తిపోటు అవసరం లేదని, ఒకేసారి పరీక్షా చికిత్స సాధ్యం అవుతుం దన్నారు. పరీక్ష జరిగిన రోజే రోగి ఇంటికి వెళ్లిపోవచ్చని తెలిపారు.

సమాజ సేవకు పునరంకితమవుదాం

ఉత్సాహంగా శర్మ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాజ సేవకు పునరంకితం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక హెూటల్ మౌర్యలో గుడ్ హార్ట్స్ పేరుతో ఏర్పడిన శర్మ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా సాగింది. తొలుత సీతారాంపురంలో ఏర్పాటు చేసిన తమ గురువు ఎస్ఎస్ ఈశ్వరప్రసాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాము చదివిన సిఎస్ఆర్ శర్మ కళాశాలలో పూర్వ విద్యార్థులు కొద్దిసేపు గడిపారు. అనంతరం మౌర్య హెూటల్లో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. . ఇటీవల మరణించిన పూర్వ విద్యార్థులైన ఆర్ మార్క్,, యాదల సుబ్బారావుకు నివాళులు అర్పించారు.. సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులందరూ వారి వారి అనుభవాలను పంచుకున్నారు.

ఇటీవల వివిధ హెూదాలలో పనిచేసి పదవి విరమణ పొందిన బెజ్జం సుబ్బారావు, నాగేశ్వరరావు, ఆర్ వెంకటేశ్వర్లు, కే



శర్మ కళాశాల పూర్వ విద్యార్థులు

వెంకటేశ్వర్లు,, సౌజన్య కుమార్, సుకుమార్ బాబు, పోలయ్య లకు సన్మానం చేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవకు అంకితం కావాలన్న ఉద్దేశంతో నిర్మాణాత్మకంగా పనిచేసేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా సామాజిక కార్యక్రమాలకు పలువురు కొంత నిధిని సమకూర్చారు. శర్మ కాలేజీలో తమతో పాటు చదువుకుని ఆర్థిక ఇబ్బందులలో ఉన్న వారికి సహాయం చేయాలని, పలు సామాజిక కార్యక్రమాలను సత్వరం చేపట్టాలని ఇందుకోసం భవిష్యత్తు నిధిని సమకూర్చుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షులుగా పల్నాడు డిఆర్ఓ ఏకా మురళి, ఉపాధ్యక్షులుగా కత్తి కళ్యాణ్, కార్యదర్శులుగా కొమ్మూరి రవిచంద్ర, కె. దేవ సహాయం, కోశాధికారిగా యాతం శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులతో గోవాడ రమేష్ బాబు ప్రమాణం చేయించారు.

'స్వచ్ఛ ఆంధ్ర'లో పరిసరాలు పరిశుభ్రం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఒంగోలు తాలూకా పోలీసులు శనివారం ప్రత్యేక సిఐ విజయకృష్ణ, స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది కలిసి ఒంగోలు పట్టణంలోని 33వ డివిజన్‌లో మిలటరీ కాలనీ, యానాది కాలనీలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రదేశాల పరిసరాలను శుభ్రం చేశారు. నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి, దోమలు మరియు ఇతర క్రిములు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మురుగునీటి పారుదల కాలువలను శుభ్రం చేసి, రసాయన ద్రావణాలను పిచికారీ చేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, త్రాగునీటిని శుభ్రంగా ఉంచుకోవడం, ఆహార పదార్థాలను మూసి ఉంచడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి ప్రాథమిక ఆరోగ్య నియమాలను అధికారులు ప్రజలకు వివరించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.



'స్వచ్ఛ ఆంధ్ర'లో తాలూకా సిఐ విజయకృష్ణ, ఎస్ఐ ఫిరోజ్

నూతన వధువుకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని మాదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన విఆర్ఎ దార్ల రామారావు - సరోజ నిర్మల కుమార్తె ఇంద్రావతి వివాహ మహెూత్సవ కార్యక్రమానికి శనివారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. నూతన వధువు ఇంద్రావతిని అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వీరితో పాటు మండల టిడిపి నాయకులు అవులూరి యలమంద, దోర్నాల అంజిరెడ్డి, మీగడ ఓబులరెడ్డి, నడిపి ఓబుల్ రెడ్డి, కాటూరి శ్రీను, కొనకనమిట్ల టిడిపి మాజీ కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ కందుల రవి, పొదిలి, మాదిరెడ్డిపాలెం, నందిపాలెం, ఓబులక్కపల్లి గ్రామాల నాయకులు, రెవెన్యూ, ఎల్ఐసి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

'రిలీఫ్' రూ.28 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చాలాకాలంగా పెండింగ్‌లోని ఎస్సీ ఎస్టీ రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి దళిత నేత నీలం నాగేంద్రరావు కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాము అనేకసార్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామిని కలిసి ఎస్సి, ఎస్టి రిలీఫ్ ఫండ్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశామన్నారు. సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి ని కలిసి రిలీఫ్ ఫండ్స్ పై ఫిర్యాదు చేశామన్నారు. ఎట్టకేలకు సుమారు ఎస్సి, ఎస్టి రిలీఫ్ ఫండ్ 90 కోట్లు మంజూరు కావలసి ఉండగా 28 కోట్ల 30 లక్షల రూపాయలు రిలీఫ్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మంజూరు చేయించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు నేరుగా బాధితుల అకౌంట్లో ఈ రిలీఫ్ ఫండ్‌ను జమచేయాలని, రాష్ట్ర



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

వ్యాప్తంగా మంజూరైన ఈ రిలీఫ్ ఫండ్స్ లో అత్యధికం ప్రకాశం జిల్లాకు రూ.6 కోట్లు, రెండవ స్థానంలో బాపట్ల జిల్లాకు రెండు కోట్ల 62లక్షల 60 వేలు మూడవ స్థానంలో గుంటూరు జిల్లాకు రూ.2.18 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీలైనంత త్వరగా ఎస్సి, ఎస్టి కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలు కూడా మంజూరు చేయించాలని ఆయన మంత్రి డిబివి స్వామిని డిమాండ్ చేశారు. సమావేశంలో దారా అంజయ్య, కాకుమాను రవి, పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని వేమూరుకు చెందిన కొండమూడి కరుణాకరరావు, పిల్లి ఆంజనేయ ప్రసాద్, వేమూరు సరబండి, దుర్గం గోపీచంద్, కోడిపరు గ్రామానికి చెందిన గోవాతోటి జ్యోతిలు ఆరోగ్యానికి గురై వైద్య చికిత్సలు పొందుతుండగా వైద్యానికి అవసరమైన ఖర్చులను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సిఫార్సుతో మంజూరైన చెక్కులను శనివారం అందజేశారు. కరుణాకరరావుకు రు.2,50 లక్షలు, ఆంజనేయ ప్రసాద్‌కు రు .1.08లక్షలు, సర బండికి రు.65వేలు, గోపీచంద్‌కు రు.50వేలు, జ్యోతికి రు.19వేల చొప్పున చెక్కుల రూపంలో అందజేశారు.



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

పొగాకు నియంత్రణలో భాగంగా జులై 1 నుండి జులై 21 వరకు అత్యధిక సంఖ్యలో సంతకాలు సేకరించిన విద్యార్థులకు కలెక్టర్ జె వెంకట మురళి పాఠశాల బ్యాగులు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ విద్యార్థులు పొగాకు వ్యతిరేక సంతకాల సేకరణ, పొగాకు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిజ్ఞను ప్రజలకు తెలియచేసి సంతకాలు సేకరించారు. సేకరించిన సంతకాలను పరిశీలించి ఎవరైతే ఎక్కువ సంతకాలు సేకరించారో ప్రతి మండలం నుండి మొదట వచ్చిన ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సమకూర్చిన పాఠశాల బ్యాగులు బహుకరించారు. ప్రతి మండలంలో మొదట వచ్చిన ముగ్గురు విద్యార్థులకు ఎంఇఒలు పాఠశాల బ్యాగులను బహుకరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, ఎన్‌సిడిపిఓ డాక్టర్ లలిత రాజేశ్వరి, పొగాకు నియంత్రణ జిల్లా అధికారి బి రమేష్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు



బాణాల ఆకాష్ (14)

యువకులతో కలిసి సరదాగా కాలువలోకి ఈతకు వెళ్లి వంతెన పైనుండి దూకి యువకుడు గల్లంతై మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని పల్లికోనకు చెందిన బాణాల ఆకాష్ (14) అలియాస్ విన్ను శనివారం ఉదయం పక్కనే ఉన్న భట్టిప్రోలు మెయిన్ డ్రైన్‌లో రాచూరు వెళ్లే కాలువ వంతెన వద్ద సరదాగా పలువురు యువకులతో కలిసి ఈతకు వెళ్లారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు కాలువ నిండుగా పొంగి పొర్లుతుండటంతో నీటిలోకి దూకిన ఆకాష్ నీటిలో గల్లంతయ్యాడు. గ్రామస్తులు పోలీసుల సహాయంతో కాలువలో గాలించగా మధ్యాహ్నానికి మృతుడై లభించాడు. ఈ మేరకు పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివయ్య తెలిపారు. అధిక వర్షాల కారణంగా వాగులు, కాలువలు ఉధృతంగా ఉన్నందున కాలువల్లోకి దిగవద్దని ఎస్ఐ సూచించారు.

విశ్రాంత అధికారి వెంకటేశ్వర్లుకు పోలీస్ మెడల్

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలానికి చెందిన విశ్రాంత సిఐ అద్దంకి వెంకటేశ్వర్లు పోలీసు మెడల్ ఫర్ మెమోరియస్ సర్వీసు అవార్డు సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్నారు. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన వెంకటేశ్వర్లు ఒంగోలు పిటిసిలో సిఐగా ఉద్యోగ విరమణ చేశారు. మండలంలోని ఆరుంబాక పంచాయతీ పులిగడ్డవారి పాలెంకు చెందిన ఆయన కానిస్టేబుల్‌గా 1983లో ఉద్యోగంలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగారు. ఉద్యోగ సమయంలో 205 రివార్డులతో పాటు ఉత్తమ సేవా పతకం, అతి ఉత్కృష్ట (సెంట్రల్‌హోం మినిస్టర్ మెడల్), ఇండియన్ పోలీసు మెడల్ అందుకున్నారు. లాలాపేటలో దొంగనోట్ల కేసు, గోల్డ్ కుంభకోణం, ఎర్రచందనం దుంగల



అవార్డు అందుకుంటున్న విశ్రాంత ఎస్ఐ అద్దంకి వెంకటేశ్వర్లు

వంటి కేసులు ఛేదించడంలో కీలకంగా పనిచేశారు. పల్నాడు ప్రాంతంలో పనిచేసిన కాలంలో నక్సలైట్ల ఉద్యమంపై సమర్థవంతంగా విధులు నిర్వహించారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాట వేశారు. ఉద్యోగ సమయంలో పనిచేసిన ప్రాంతంలో పేద విద్యార్థులను గుర్తించి పూర్తి స్థాయిలో చదివించారు. వారిలో కొందరు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. 2003 మెట్టగౌడపాలెం ఇంజినీరింగ్ విద్యార్థిని దత్తత తీసుకుని పూర్తిగా ఆర్థిక సాయం అందించారు. 2012లో ఐలవరంలో ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం, భట్టిప్రోలులో ఎస్ఐగా పనిచేస్తున్న సమయంలో వెల్లటూరులో తండ్రి అప్పుల ఊబిలో చిక్కుకుని చనిపోతే కూతురుని చదివించగా ప్రస్తుతం ఆమె పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. 2018లో దాచేపల్లిలో ఓ బాలికను దత్తత తీసుకుని ఉన్నత చదువులు చదివించారు. ఇలా మానవత్వం చాటుకున్న పోలీసుగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకోవడం పట్ల మిత్రులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన



మాట్లాడుతున్న రేణంగివరం ఎస్ఐ వినోద్ బాబు

ప్రజాశక్తి - పంగులూరు

ఆరోగ్యాలను హరించే మాదక దవ్యాలను దరిచేరనీయకుండా దూరంగా ఉంచాలని, సమాజాన్ని కాపాడాలని రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు అన్నారు. మండలంలోని రేణింగవరం సెంటర్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాల వల్ల విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు. భావి భారత పౌరుల జీవితాలు అంధకారం అవుతున్నాయని అన్నారు. కొంత మంది స్వార్థపరులు స్వప్రయోజనాల కోసం మాదక ద్రవ్యాలను యువతకు అమ్ముతున్నారని అన్నారు. వాటికి బానిసలైన యువకులు జీవితాలు సర్వనాశనం చేసుకుంటున్నారని అన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.

బాపట్ల : మత్తు పదార్థాలకు బానిసలై బంగారం లాంటి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని చందోలు ఎస్ఐ శివకుమార్ యువతకు సూచించారు. మాదక ద్రవ్యాలపై పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు సేవించిన, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు తల్లి, దండ్రులు తమ పిల్లల నడవడికను గమనిస్తూ సక్రమమైన మార్గంలో నడిచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ రాజ్యలక్ష్మి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెరుకుపల్లి : గంజాయి నిర్మూలించాలని, ఎక్కడైనా అమ్మిన, కొనిన తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ అనిల్ కుమార్ సూచించారు. గంజాయి నిర్మూలన లక్ష్యంగా స్థానిక ఐలాండ్ సెంటర్లో అవగాహన కల్పిస్తూ మానవ హారం ఏర్పాటు చేశారు. గంజాయి అమ్మిన, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ గంజాయి నిర్మూలనకు సహకరించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న చందోలు ఎస్ఐ శివకుమార్



మాట్లాడుతున్న చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్

ఉత్తమ సేవలకు పురస్కారాలు



ఉత్తమ పురస్కారం అందుకుంటున్న తహశీల్దార్ గోపికృష్ణ

ప్రజాశక్తి - చీరాల

ప్రజలకు అందుబాటులో ఉత్తమ సేవలు అందిస్తున్న తహశీల్దారు గోపి కృష్ణ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ వెంకట మురళి, శాసన సభ్యులు మద్దలూరు మాలకొండయ్య చేతుల మీదుగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు.

చీరాల : గ్రామాల్లో డిబిఆర్సి ఆధ్వర్యంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఆ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ వి భగవాన్ దాస్ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జె వెంకటమురళి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. బాపట్ల, చీరాల, వేటపాలెం, కొరిసపాడు, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని గ్రామాల్లో తమ సంస్థ పనిచేస్తుందని తెలిపారు.



ఉత్తమ పురస్కారం అందుకుంటున్న భగవాన్‌దాస్

రాధాకృష్ణ మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని కొత్తపాలెం రోడ్డులోని దత్తక్షేత్రం నందు నూతనంగా ఏర్పాటు చేసిన రాధాకృష్ణ మందిరంను శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ప్రారంభించారు. ప్రధాన ధాత ఎన్నారై కిరణ్ కోడూరు ధర్మపత్ని రాధా మాధవి, కుమారుడు మహావీర్ చేతుల మీదగా ప్రారంభించారు. కార్యక్రమంలో క్షేత్ర కన్వీనర్ ప్రమీల దేవి, మహావీర్, సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, రాంబాబు, సత్యనారాయణ, రాము, వెంకటరావు, రాజేశ్వరి పాల్గొన్నారు. అనంతరం హాజరైన భక్తులకు అన్న వితరణ చేశారు.

సంతమాగులూరు : మండలంలోని సంతమాగులూరు, పత్తేపురం, పుట్టావారిపాలెం, ఏల్చూరు, మక్కెనవారి పాలెం, అడవిపాలెం గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో భారీగా అన్నదానం చేశారు. ఆయా గ్రామాల్లో ఉట్టి కొట్టు కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు శిక్ష

ప్రజాశక్తి - కొల్లూరు

గత జనవరి 16న చిలుమూరు కృష్ణా నది ఒడ్డున కనకదుర్గమ్మ, దేవి శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడిన ముద్దాయి మోపిదేవి మణికంఠ అలియాస్ పొట్టికి తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆక పవన్‌కుమార్ ఏడు నెలల జైలు శిక్ష శనివారం విధించారు. పూజారి కేశవరావు పూజలు ముగించుకుని రాత్రి గుడికి తాళాలు వేసి వెళ్లి మరుసటి రోజు ఉదయం చూడగా గుడి తాళాలు పగలగొట్టి ఉన్నాయని గమనించి ఆలయ ధర్మకర్త యార్లగడ్డ సుబ్బారావుకు చెప్పారు. సుబ్బారావు పిర్యాదుపై అప్పటి ఎస్ఐ జి ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గత జనవరి 20న చిలుమూరు కరకట్టపై బస్సు షెల్టర్ వద్ద దొంగతనం చేసిన మోపిదేవి మణికంఠ ఏలియాస్ పొట్టిని విచారించారు. విచారణలో గుడిలో చోరీ చేసిన నేరాన్ని అంగీకరించాడు. ముద్దాయి వద్ద నుండి నగలు, రూ.50 వేలు నగదు అప్పట్లో స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయి మణికంఠను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా అప్పట్లో రిమాడు విధించారు. ఈ కేసు విచారణలో సీనియర్ ఎపిపి పరిశపోగు సునీల్ కుమార్ ప్రాసిక్యూషన్ చేశారు. కోర్టు కానిస్టేబుల్ మాధవరావు సాక్షులను ప్రవేశపెట్టారు. విచారణలో మణికంఠపై నేరం రుజువు కావడంతో తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆక పవన్ కుమార్ ముద్దాయి మణికంఠకు 7 నెలలు జైలు శిక్ష విధించారు.

గోశాలకు దాణా బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పట్టణంలోని హరిహర గోశాల నందు గోవులకు రూ.9వేల విలువైన దాన వితరణ చేశారు. కార్యక్రమంలో తమన శ్రీనివాసరావు, చుండూరి మురళి సుధాకర్, గోశాల సుబ్బారావు, గూడా లక్ష్మీరెడ్డి, పూర్ణచంద్రరావు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి నీళ్లు ఎప్పటికో.?

- టెండర్ల ప్రక్రియ దాటని రూ.22కోట్ల పనులు
- జెజెఎం కుళాయి నీటి కోసం తీర ప్రాంత వాసులు

ప్రజాశక్తి - బాపట్ల

ఇంటింటికి కుళాయి ద్వారా త్రాగునీటిని అందించాలనే లక్ష్యం ఎండమావి గానే మిగిలింది. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో శుద్ధి చేసిన నీటిని ప్రతి ఇంటికి కుళాయి ద్వారా అందించాలనే లక్ష్యం నెరవేరడం లేదు. కలుషితమైన నీటిని సేవించి ప్రజలు రోగాల బారిన పడకుండా జల జీవన మిషన్ పథకాన్ని అమలు చేసి ప్రతి ఇంటికి త్రాగునీటిని అందించి ప్రజారోగ్యాన్ని పరీక్షిం చాలనే పాలకుల ప్రణాళికలు నత్తనడకగా సాగుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజలకు ప్రాణాధారమైన శుద్ధ జలాన్ని అందించడంలో పూర్తిగా విఫలం అవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్ కోసం ప్రవేశపెట్టిన పథకాలకు అధికార కూటమి ప్రభుత్వం 73 జీవోతో రద్దు చేసింది. 2019లో జెజెఎం పథకాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది. 2024 నాటికి గ్రామీణ ప్రాంతంలో ప్రతి ఇంటికి రోజుకు 55లీటర్ల కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందించాలని నిర్దేశించింది. ఏళ్లు గడుస్తున్న ఈ పథకం ముందుకు కదలడం లేదు. పాత విధానం ద్వారా చెరువులను నీటితో నింపుకొని వాటిని ఫిల్టర్ చేసి ఆయా గ్రామాల ప్రజలకు అందిస్తున్నారు. నీటి ఎద్దడి తలెత్తితే రోజు మార్చి రోజు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో నీటి కష్టాలు తప్పడం లేదు. వీధి కుళాయిల వద్ద మహిళల మధ్య పానీపట్టు యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో బావులు, బోరుల ద్వారా భూమిలోని నీటిని తోడుకొని వాడుకునేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. భూగర్భ జలాలు కలుషితం అయ్యాయి. తీర ప్రాంత గ్రామాల్లో ఆక్వా సాగుతో రొయ్యల హేచరీల నుండి వెలువడే వ్యర్థ జలాలు భూమిలోకి వదలడంతో తీరప్రాంత గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమై బావుల్లో నీరు త్రాగడానికి పనికి రాకుండా పోయాయి. వ్యవసాయ పంటలు కూరగాయలు, పూల సాగుకు సైతం భూగర్భ జలాల కలుషితం కావడంతో సన్న, చిన్న కారు రైతులు



పబ్లిక్ కుళాయిలు వద్ద మహిళల నీటి కష్టాలు (ఫైల్‌ఫోటో)

సమస్యలు ఎదుర్కొంటున్నారు. రొయ్యల పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థ జలాలు శుద్ధి చేసే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సిన హేచరీ యజమానులు, అధికారులు చేయడం లేదు. కలుషిత జలాలను శుద్ధి చేసే విధానం అమలుకు నోచుకోకపోతే రానున్న రోజుల్లో భూగర్భ వ్యర్థ జలాలకు తోడు వాతావరణ కాలుష్యంతో భవిష్యత్తు తరాలు కాలుష్య కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. పేరలి డ్రైయిన్‌లో నీటిని ఎత్తిపోతల పథకాల ద్వారా తీరంలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఎత్తిపోతల పథకాలతో ముత్తాయపాలెం, మద్దిబోయిన వారిపాలెం, పోతురాజు కొత్తపాలెం గ్రామాల గరువు భూముల్లో వరి సాగు చేస్తారు. డ్రెయిన్‌కు సముద్రపు పోటు నీరు తగలడంతో ఉప్పునీటి ప్రభావంతో గ్రామాల్లోని బావుల్లో నీరు త్రాగేందుకు పనికి రాకుండా పోయింది. దీంతో నీళ్లు కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టెండర్ల దశ దాటని జెజెఎం పనులు

నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ పనులు టెండర్ల దశ దాటి ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గ స్థాయిలో 63 పనులను రూ.22 కోట్ల అంచనాలతో పనులు ప్రతిపాదించారు. ఆ పనులు టెండర్ల దశలోనే ఉన్నాయి. బాపట్ల మండలంలోని 27 పంచాయతీల్లో శివారు గ్రామాలు కలుపుకొని 42 గ్రామాలకు రూ.13.45కోట్లు, కర్లపాలెం మండలంలో 20 పంచాయతీల్లో ఏడు గ్రామాలకు త్రాగునీరు



జెజెఎం పనుల శంకు స్థాపన శిలాఫలకం



చెరువు వద్ద ఉన్న నీటి శుద్ధి ట్యాంకు (ఫైల్‌ఫోటో)

అందించేందుకు రూ2.59కోట్లు, పిట్టలవానిపాలెం మండలంలో 14 పంచాయిల్లో జెజెం పథకాన్ని అమలు చేసేందుకు రూ5.97కోట్లతో అంచనాలు తయారు చేశారు. గత ప్రభుత్వంలో రూ1.11కోట్ల జెజెఎం నిధులతో మూలపాలెం జగనన్న కాలనీలో 1050 గృహాలకు కుళాయి ద్వారా త్రాగునీరు అందించేందుకు జల్ జీవన మిషన్ పథకం పైపులైన్ కోసం ఉప్పరపాలెంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు అలంకార ప్రాయంగా మగిలింది. మూలపాలెం జగనన్న కాలనీకి మాత్రమే జల్ జీవన్ మిషన్ ద్వారా పైప్ లైన్లు వేశారు. ఉప్పరపాలెం ఓవర్ హెడ్ ట్యాంకు వరకు పైపులు ఎప్పుడు వేస్తార నేది స్పష్టత లేదు. తీర ప్రాంత గ్రామాలైన ఆసోదివారిపాలెంలో 2, ముత్తాయపాలెం 6, పాండురంగా పురం, పడమర బాపట్లలో రూ.10.22కోట్లతో తాగునీరు అందించేందుకు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ చెరువు వద్ద శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

బావి నీళ్లు తోడుకొని త్రాగేవాళ్ళం

ముప్పై ఏళ్ల క్రితం ఇలాంటి ఇబ్బందులు లేవని ముత్తాయ పాలెంకు చెందిన వల్లభుని రామచంద్రరావు తెలిపారు. ప్రస్తుతం సముద్ర కరాకు ప్రాంతంలో భూమిలో నీటిని త్రాగేందుకు సమస్యగా మారిం దని తెలిపారు. రొయ్యల హేచరీ లు, ఎత్తిపోతల పథకాలతో వచ్చే ఉప్పు నీటితో భూగర్భ జలాలు కలుషితమై త్రాగునీటి కష్టాలు తప్పడం లేదని తెలిపారు.



వల్లభుని రామచంద్రరావు, ముత్తాయపాలెం

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి



లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి - వేమూరు

రాజకీయాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా పోరాడిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు కొనియాడారు. గుంటూరు బస్టాండ్ సెంటర్‌లో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా విగ్రహానికి, చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రేపల్లె : సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రి సోదరులు అనగాని శివప్రసాద్ అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా లచ్చన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, టిడిపి నాయ కులు వెనిగళ్ళ సుబ్రమణ్యం, చేన్ను నాగమల్లేశ్వరరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, ధర్మతేజ పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొండయ్య

చీరాల : స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజాసేవకుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్బంగా స్థానిక గడియార స్థంభం సెంటర్లోని లచ్చన్న విగ్రహంకు పూల మాల వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత 'సర్దార్' బిరుదు గౌతు లచ్చన్నకే దక్కిందని పేర్కొన్నారు. బెజవాడ గోపాలరెడ్డి, ప్రకాశం పంతులు మంత్రివర్గంలో ఆయన సేవలందించారని గుర్తు చేశారు. ఆయన కుమారుడు శ్యామ్ సుందర్ శివాజీ ఎంఎల్‌ఏగా విశేష సేవలందించగా ప్రస్తుతం ఆయన మనవరాలు గౌతు శిరీష ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, ఎఎంసి చైర్మన్ కౌతా వరపు జనార్దన్, కౌన్సిలర్ సూరగాని లక్ష్మీ, నరసింహా రావు దంపతులు, సూరగాని పిచ్చయ్య, కర్పూరపు రామారావు, సూరగాని హనుమంతరావు, వల్లెపు వేణు, చేబ్రోలు శరత్ బాబు, బొమ్మిడి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్వతంత్ర సమర యోధులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వరరావు శనివారం నివాళులు అర్పించారు. లచ్చన్న 116వ జయంతి వేడుకలు మండలంలోని పెద్దపులివర్రు, గుత్తావారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి మద్రాసుకు, ఆంధ్ర రాష్ట్రంలో 5సార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, పార్ల మెంటు సభ్యునిగా గెలుపొందారని అన్నారు. కార్యక్ర మంలో సీనియర్ న్యాయవాదులు కేసన్న రామస్వామి, చిన్ను నాగమల్లేశ్వరరావు, గౌడ సంఘీయులు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి యువత ఆదర్శంగా తీసు కోవాలని కొలలపూడి సర్పంచ్ ఎం సతీష్ కుమార్ అన్నా రు. స్థానిక గౌడ కమ్యూనిటీ హాలులో గాలి నాగేశ్వర రావు అధ్యక్షతన లచ్చన్న 116వ జయంతి వేడుకలు నిర్వహిం చారు. రాష్ట్ర ప్రభుత్వం లచ్చన్న జయంతిని అధికార దినంగా ప్రకటించటం హర్షించదగ్గ విషయమని అన్నారు. తాతా హనుమంతరావు, కృష్ణయ్య, యడవల్లి వీర నారాయ ణ, సాంబయ్య, రగుతు కోటయ్య, నాగార్జున, గణేష్, వెంకట్రావు, రవీంద్ర, చందు, శ్రీకాంత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రేపల్లెలో పాల్గొన్న మంత్రి సోదరులు శివప్రసాద్



భట్టిప్రోలులో లచ్చన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు



లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మరమ్మత్తులకు గురైన ఉప్పరపాలెం రైల్వే గేటు

ఉప్పరపాలెం రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని ఐదు వార్డుల ప్రజలు రాకపోకలు జరిపే ఉప్పరపాలెం రైల్వే గేటును వారం రోజులు మూసేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేటు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మత్తుల చేస్తున్న కారణంగా రైల్వే గేటు ద్వారా రాకపోకలు నిలిపివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ, చెన్నై రైల్వే మార్గంలో మూడో లైను ఏర్పడ్డాక రైళ్ళ రాకపోకలు పెరగడంతో ఉప్పరపాలెం గేటు తరచూ గంటల తరబడి మూసి వేస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు కొనసాగించే పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అండర్ పాస్ నిర్మించాలని గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు రైల్వే శాఖకు పంపారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ప్రతినిత్యం ఈ గేటు ద్వారా రాకపోకలు కొనసాగించే ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు అండర్ పాస్ నిర్మించే విధంగా రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

ఆశ్రమ నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట నీలకంఠాపురం అనాధ వృద్ధాశ్రమం 30వ వార్షికోత్సవం, ఆదరింపు సత్రం ప్రారంభోత్సవంలో శాసన సభ్యులు ఎంఎం కొండయ్య మాట్లాడారు. అనాధ వృద్ధాశ్రమం కమిటీ సభ్యులు, వ్యవస్థాపకులు సత్రం మల్లేశ్వరరావు, ప్రెసిడెంట్ గుత్తి విశ్వేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహార పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, ఆప్కో చైర్మన్ డాక్టర్ సజ్జ హేమలత, తెలుగుదేశం స్టేట్ సెక్రెటరీ నాసిక వీరభద్రయ్య పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎంఎల్ఎ కొండయ్య

సర్టిఫికెట్ల ప్రదానం

ప్రజాశక్తి - చీరాల

కొత్తపేటలోని ఎస్ఆర్‌జి వన్ కళ్యాణ మండపంలో కరాటే బెల్ట్ సర్టిఫికెట్ బహుమతుల ప్రధానోత్సవ సభకు సినీ హీరో సుమన్‌తో కలిసి శాసన సభ్యులు ఎంఎం కొండయ్య హాజరయ్యారు. కరాటే విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరాటే ట్రైనర్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎన్‌టిఆర్‌ను విస్మరించిన నాయకులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక రథం సెంటర్లోని ఎన్టీఆర్ కృష్ణుడి వేషధారణ విగ్రహానికి ముందు టిడిపి నాయకుల ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ఎన్టీఆర్ విగ్రహం కనిపించకుండా చేయడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు కృష్ణాష్టమి రోజునైనా ఆ విగ్రహం గుర్తుకు రాలేదేమోనని వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో కలవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభ దశలోనే కురుస్తున్న ఈ వర్షాల కారణంగా బాపట్ల జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. ప్రస్తుతం వారం నుంచి నెల రోజుల దశలో వరి ఉంది. ఈ వర్షాల కారణంగా రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాల్సి ఉంది. ఈ వేసవిలో కూడా పంట కాలువలు, మురుగు కాలువ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో వరదనీరు వేగంగా దిగువకు వెళ్లే అవకాశం లేక పంట పొలాల మునక తప్పడం లేదు. గడచిన కాలమంతా పంటకాలువకు మరమ్మతులు లేకపోవడంతో చివరి భూములకు సాగు నీరు అందే పరిస్థితి లేకపోయింది. భారీ వర్షాలు, వరదలకు కాలువలకు పడిన గండ్లు పూడ్చేందుకు నిధులు లేక పంట పొలాలకు నీరందక రైతులు నష్టపోయారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరువాత సాగునీటి సంఘాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ సీజన్‌లో అయినా పంటకాలువల మరమ్మతులు పూర్తవుతాయని భావించారు. కానీ అలా జరగలేదు. ఇప్పుడు అయినా భారీవర్షాల కారణంగా వచ్చే వరదనీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. లేదంటే చేతికి పంట అందివచ్చే సమయంలో వరదల తాకిడికి రైతులు తమ పంటలను నష్టపోతున్నారు. మురుగుకాలువ మరమ్మతులు కూడా పూర్తి చేయాల్సి ఉంది.



ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా జరుగుతున్న నల్ల బర్లీ పొగాకు కొనుగోలులో వేగం పెంచాల్సి ఉంది. కౌలు రైతులు, చిన్న, సన్నకారు రైతులకు చెందిన పొగాకు కొనుగోలుకు ప్రాధాన్యతనివ్వాల్సి ఉంది. పొగాకు అయితే కొంటున్నారు గానీ ఇప్పటివరకు రైతులకు నగదు చెల్లింపులు జరగలేదు. ప్రభుత్వం పొగాకు కొన్న వెంటనే చెల్లింపులు చేస్తామని చెప్పారు. కానీ నెలలు గడుస్తున్నా నగదు చెల్లింపులు లేవు. వ్యవసాయ పనులు ప్రారంభం అయిన నేపథ్యంలో రైతులు సేద్యం చేసేందుకు వెంటనే నగదు విడుదల చేయాల్సి ఉంది. గ్రానైట్ క్వారీల్లో కార్మికుల భద్రతను యాజమాన్యాలు గాలికి వదిలి వేశాయి. ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలపై పరిశ్రమల యాజమాన్యం పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. వరుస ప్రమాదాలు సంభవించి కార్మికులు ముఖ్యంగా వలస కార్మికులు మరణిస్తున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. పరిశ్రమల్లో పని చేసే కార్మికుల భద్రత వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్యక్రమాలను వారికి చేరేలా చూడాల్సి ఉంది. కార్మికులందరిని ఈ శ్రమ్ పోర్టల్ లో చేర్చి విధిగా ఈ-శ్రమ్ కార్డులు జారీ చేయాలి. కార్మికులకు తప్పనిసరిగా పిఎఫ్, ఈఎస్ఐ వర్తించేలా చూడాలి. 8 గంటల పని దినాలు పక్కాగా అమలు జరిగేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలి.

రాష్ట్ర ప్రభుత్వం మధ్యం షాపుల దగ్గర పర్మిట్ రూమ్‌లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. షాపులకు అనుబంధంగా రూములు లేకపోవడం వల్ల బహిరంగ మద్యపానం పెరిగిపోయిందని, అందువల్ల పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇస్తున్నట్లు చెబుతోంది. ఇప్పటికే దాదాపు అన్ని మద్యం షాపుల దగ్గర రూములు పెట్టడం జరిగింది. బెల్ట్‌షాపులు కూడా అన్ని చోట్లా పెట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి అదనపు ఆదాయం కోసం పర్మిట్‌రూమ్‌లకు అనుమతి ఇస్తున్నట్లు భావించాల్సి వస్తోంది. పర్మిట్ రూమ్‌ల కోసం షాప్ యజమానులు ఏడాది సదరు షాపుల అమ్మకాలను బట్టి షాప్‌నకు రూ.5 లక్షలు, రూ.7.5 లక్షలు రుసుం నిర్దేశించారు. ఈ పర్మిట్ రూమ్‌లో కేవలం సీల్డ్ బాటిల్‌లను కొనుగోలు చేసిన వారు మాత్రమే తాగేందుకు అనుమతి ఉంటుందని చెబుతున్నారు. పర్మిట్ రూమ్‌లు గరిష్టంగా 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలి. శానిటేషన్, హ్యాండ్‌వాష్, త్రాగునీటి సౌకర్యాలు తప్పనిసరి అని నిబంధనలు పెట్టారు.

ప్రభుత్వం నూతన బార్ల పాలసీని కూడా ఖరారు చేసింది. కొత్త మార్గదర్శకాలను ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. కొత్త పాలసీ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు బార్లు పనిచేస్తున్నాయి. కొత్త పాలసీలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ బార్లు ఉంటాయి. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. ఒక దరఖాస్తుకు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజుగా నిర్ణయించారు. లైసెన్స్ ఫీజును మూడు కేటగిరీల్లో నిర్ణయించారు. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, పర్యాటక శాఖ గుర్తించిన పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే లైసెన్సీలు బార్లు ఏర్పాటు చేయాలి. బాపట్ల జిల్లాలో మొత్తం 17 బార్లు ఉన్నాయి. వీటికి సంవత్సరానికి రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించడం జరిగింది. ఈ లైసెన్స్ ఫీజు సంవత్సరంలో ఆరు విడతలుగా చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చింది.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

వైవిధ్యభరితంగా పుస్తక మహోత్సవం

పాఠకులను ఆకట్టుకొనేలా పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, గ్రంథాలయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఒంగోలు పుస్తక మహోత్సవం రెండో రోజు శనివారం నాడు కార్యక్రమాలు విజయవంతంగా, వైవిధ్యభరితంగా సాగాయి. పుస్తక స్టాల్స్‌ను సందర్శించిన పలువురు ప్రముఖులు పుస్తకాలు కొనుగోలు చేసి, చిన్న పట్టణంలో ఇంత గొప్ప పుస్తక ఉత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

పిల్లల కోసం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్...

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లల కోసం ప్రత్యేక ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ వర్క్‌షాప్ జరిగింది. సి.ఎ. ప్రసాద్, సంగెం అనిల్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించి, కళలు మరియు చేతిపనులలో మెళకువలను పిల్లలకు నేర్పించారు. మొత్తం 40 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

'జనవిజ్ఞాన వేదిక' పుస్తకాల ఆవిష్కరణ...



గాజు పెంకులపై నడుస్తున్న బాలిక



జనవిజ్ఞానవేదిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాయంత్రం 6 గంటలకు జన విజ్ఞాన వేదిక ప్రచురించిన రెండు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. డాక్టర్ గేయానంద్ రచించిన చరిత్ర గమనంలో సైన్స్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం రచించిన ప్రజా సైన్స్ ఉద్యమం పుస్తకాలు ఆవిష్కరణ గావించారు. కార్యక్రమంలో జెవివి సీనియర్ నాయకులు మంగమ్మ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎ.వి.పుల్లారావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ దార్ల బుజ్జిబాబు, సి.హెచ్. జయప్రకాశ్, యు.భాస్కర్, జిల్లా అధ్యక్షులు యు.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ గేయానంద్ రచనలో మానవ పరిణామ క్రమంలో కమ్యూనికేషన్ ప్రాముఖ్యత వివరించబడిందని, విఠపు బాలసుబ్రహ్మణ్యం పుస్తకం ద్వారా ప్రజా సైన్స్ ఉద్యమ చరిత్ర తెలుసుకోవచ్చుని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాజుపెంకులపై నడవడం ద్వారా మాయలు మంత్రాలు లేవని రుజువు చేశారు.

కవి సమ్మేళనం...

రాత్రి 7 గంటలకు జరిగిన "వందమంది కవులతో కవి సమ్మేళనం" ఆద్యంతం శ్రోతలను అలరించింది. పొన్నూరు వెంకట శ్రీనివాస్, చంద్ర నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఎ.ఎం.డి. ఇంతియాజ్ (ఐఏఎస్) హాజరయ్యారు. నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తేళ్ల అరుణ,షేక్ ఇస్మాయిల్ పలువురు కవులు తమ కవిత్వాలతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. తొలుత పూర్వ కలెక్టర్ ఇంతియాజ్ స్టాల్స్‌ను సందర్శించి, భారత రాజ్యాంగం పుస్తకాన్ని కొనుగోలు చేసి పఠనాన్ని ప్రోత్సహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాశక్తి బుక్ హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ మనోహర్ నాయుడు ప్రధాన భూమిక వహించారు. పలువురు పబ్లిషర్లు సైతం పాల్గొన్నారు. మొత్తంగా రెండో రోజు కార్యక్రమాలు పిల్లలకు వినోదం, సైన్స్ పట్ల ఆసక్తి, సాహిత్యాభిమానులకు సజనాత్మకతను పంచి పుస్తక మహోత్సవాన్ని మరింత రంజింపజేశాయి.

తప్పిపోయిన బాలుడు..

గంటలోనే తల్లిదండ్రుల చెంతకు..

పోలీసులను అభినందించిన ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

తప్పిపోయిన బాలుడిని గంట వ్యవధిలోనే పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చిన ఘటన శనివారం జరిగింది. ఒంగోలు, విజయనగర కాలనీకి చెందిన అన్నంపల్లి గురవయ్య కుటుంబసభ్యులతో కలిసి ఒంగోలు అన్నవరప్పాడులోని ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం ఆటోలో ప్రయాణించి ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సు ఎక్కించేందుకు వచ్చారు. బంధువులను బస్సులో ఎక్కించిన అనంతరం గురవయ్య తన ఐదు సంవత్సరాల కుమారుడు అన్నంపల్లి తేజస్ చెయ్యి పట్టుకొని తిరిగి వస్తున్నారు. అదే సమయంలో బాలుడు చెయ్యి వదిలి, తల్లిదండ్రులు చూసేలోపు బస్సుల మధ్యలో నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు ఒకవైపు, బాలుడు మరో వైపు వెళ్లడంతో పిల్లవాడు కనిపించకుండా పోయాడు. ఈ సమాచారాన్ని డయల్ 112కు తెలియజేశారు. డయల్ 112 పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది వెంటనే స్పందించి తక్షణమే ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌కు మరియు ట్రాఫిక్ పోలీసులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన తాలూకా సీఐ విజయకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ మాలాద్రి, ఏఎస్ఐ హనుమంతరావు మరియు పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నగరంలో లక్కీ షాపింగ్ మాల్ ఎదురు ఉన్న సోనీ షాప్ వద్ద బాలుడిని గుర్తించారు. కేవలం ఒక గంటలోనే బాలుడిని గుర్తించి, తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా అప్పగించారు.



బాలుడిని అప్పగిస్తున్న సిఐ, ఎస్ఐలు

తప్పిపోయిన బాలుడిని త్వరగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన తాలూకా సీఐ విజయ్‌కష్ణ, ట్రాఫిక్ ఆర్ ఎస్ఐ మాలాద్రి, ఏఎస్ఐ హనుమంతరావు, కానిస్టేబుల్ జాబీర్‌లను ఎస్పీ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

